• లబ్ధిదారుల ఇళ్ల వద్దే పింఛన్ పంపిణీ

నందిగామటౌన్: సబ్ డివిజన్ పరిధిలోని నందిగామ మండలంలోని అంబారుపేట గ్రామంలో పింఛన్ల పంపిణీని మంగళవారం ఆర్డీవో బాలకృష్ణ ప్రారంభించారు.



నూతన వత్సర సందడి



జగ్గయ్యపేటలో రంగుల దుకాణాల వద్ద సందడి



కంచికచర్ల ప్రధాన బజార్‌లో న్యూ ఇయర్ స్వీట్లు అమ్ముతున్న మహిళ

జగ్గయ్యపేట అర్బన్ : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పట్టణంలో మంగళవారం పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా మున్సిపల్ సెంటర్, బస్టాండ్ సెంటర్, నెహ్రూ చౌక్, రైతు బజారు సెంటర్, ముక్త్యాల రోడ్డు, కోదాడ్ రోడ్డులలో పలు బేకరీలు, ఫ్యాన్సీ స్టోర్స్, పండ్లు, స్వీట్ల దుకాణాలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించి ముస్తాబు చేశారు. ప్రధానంగా కేక్‌లను కొనుగోలు చేసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు బేకరీల వద్ద గుమిగూడారు. యువకులు, విద్యార్థులు తమ స్నేహితులకు శుభాకాంక్షలు తెలిపేందుకు గ్రీటింగ్స్ కోసం ఫ్యాన్సీ స్టోర్స్ వద్ద బారులు తీరారు.

కంచికచర్ల: న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా మంగళవారం కంచికచర్ల వీధుల్లో స్వీట్లు, కేక్‌లు, పండ్లు, పూలదండలు, రంగుల విక్రయాలు ఊపందుకున్నాయి. కేక్‌ల దుకాణాలు అడుగడుగునా వెలిశాయి. కొత్త ఏడాదికి స్వాగతం పలికేందుకు ప్రజలు కేక్‌లు, స్వీట్లు కొనుగోలు చేసేందుకు ఎక్కువ మక్కువ చూపారు. కేక్‌లు, బొకేల దుకాణాలు కూడా ప్రజలతో కిక్కిరిశాయి. కంచికచర్లలోని నెహ్రూ బొమ్మ సెంటర్, ఇందిరాగాంధీ విగ్రహం సెంటర్, అంబేద్కర్ సెంటర్, పెట్రోలు బంక్ సెంటర్‌లలో స్వీట్లు, కేక్‌లు దుకాణాలు వెలిశాయి. రోడ్లు వెంబడి బిర్యానీ ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేశారు.

పట్టణంలో ప్రధాన సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం అందజేస్తున్న వైస్ చైర్‌పర్సన్ హఫీజున్నీసా, మనోహర్

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో ప్రధాన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వైఎస్సార్ సీపీకి చెందిన మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ షేక్ హఫీజున్నీసా, కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్ కోరారు. మంగళవారం వారు మున్సిపల్ చైర్మన్ చాంబర్‌లో చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కమిషనర్ రామ్మోహనరావును కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. మనోహర్ మాట్లాడుతూ ప్రస్తుత కౌన్సిల్ ఏర్పడి 3 ఏళ్లు అవుతున్నా వీధి కుక్కల నుంచి ప్రజలను కాపాడలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారని, గత వైఎస్సార్ సీపీ పాలనలో జగనన్న కాలనీలో ఎల్‌పీ-1, ఎల్‌పీ-2 ఏర్పాటుచేశారని, ఎల్‌పీ-2 లో 950 మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వగా, 200 మంది ఇళ్లు నిర్మించుకున్నారని తెలిపారు. ఇటీవల వచ్చిన వరదలకు కాలనీకు నీరందించే పాలేటిలోని దెయ్యాల మడుగు వద్ద ఉన్న మోటారు కొట్టుకుపోయి నీటి సమస్య తీవ్రంగా ఉన్నా ఇప్పటివరకు ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. అక్రమ లేఅవుట్లను నివారించాలని, ముఖ్యంగా బలుసుపాడు రోడ్‌లో అనధికార లేఅవుట్లు ఉన్నాయని, రోడ్ల ఆక్రమణలను తొలగించాలని కోరారు. పట్టణంలోని రోడ్ల మార్జిన్లలో గ్రావెల్‌తో నింపాలని, ప్రధాన పైపులైన్ లీకేజీతో నీరంతా వృథాగా పోతుందని తెలిపారు. సమస్యల నుంచి తప్పించుకోవడానికే కౌన్సిల్ సమావేశాన్ని మన్మోహన్ సింగ్ సంతాపదినాల పేరుతో వాయిదా వేశారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా, కోఆప్షన్ సభ్యురాలు బషీరున్నీసా బేగం పాల్గొన్నారు.





మాజీ ప్రధాని మన్మోహన్ సేవలు స్ఫూర్తిదాయకం

మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చైర్మన్ రాఘవేంద్ర



మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చైర్మన్ రాఘవేంద్ర, కమిషనర్, కౌన్సిలర్లు

జగ్గయ్యపేటఅర్బన్: దివంగత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ దేశానికి అందించిన సేవలు, సంస్కరణలు స్ఫూర్తిదాయకం అని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అధ్యక్షతన జరిగింది. సమావేశంలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ హఫీజున్నీసా, తుమ్మల ప్రభాకర్, కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొద్దిసేపు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం పట్ల ఆయన చూపిన అంకితభావం చిరస్మరణీయమన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ హఫీజున్నీసా మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ జీవితం రాబోయే తరాలకు ఒక విలువైన పాఠంగా నిలుస్తుందన్నారు. మరొక వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ మాట్లాడుతూ మన్మోహన్‌సింగ్ ఆర్థికవేత్తగా, ప్రధానిగా దేశానికి అందించిన సేవలు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, పేరం సైదేశ్వరరావు మాట్లాడుతూ మన్మోహన్‌సింగ్‌కు భారత రత్న బిరుదు ఇచ్చి గౌరవించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ డీఈఈ కరీ ముల్లా, ఏఈ అహ్మద్, టీపీవో గోవర్దన్, ఇన్‌చార్జ్ మేనేజర్ తాజుద్దీన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సత్కారం



షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ తప్పదని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ అన్నారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయునిగా పని చేస్తున్న పాకాలపాటి కనకరాజు మంగళవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా అభినందన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ కనకరాజు సైన్స్ ఉపాధ్యాయునిగా విద్యార్థులకు అందించిన సేవలను కొనియాడారు. అనంతరం కనకరాజు దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, యాజమాన్య కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొండితోక సోదరుల నూతన సంవత్సర శుభాకాంక్షలు



నందిగామటౌన్: నూతన సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితాలలో వెలుగులు నింపాలని మాజీ శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు నూతన ఏడాదిని సంతోషంగా జరుపుకోవాలన్నారు.

తన్నీరు నూతన సంవత్సర శుభాకాంక్షలు



జగ్గయ్యపేటఅర్బన్ : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నూతన సంవత్సరం వారి జీవితాలలో సరికొత్త క్రాంతిని తీసుకొచ్చి వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ఆ భగవంతుడు వారికి మంచి మేలులు చేకూర్చాలని కోరారు.

రెవెన్యూ సదస్సుకు 10 అర్జీలు



సాయినగర్ భూములపై చర్యలు తీసుకోవద్దని కోరుతూ వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): గ్రామంలోని సచివాలయంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ తహసీల్దార్ మనోహర్ మాట్లాడుతూ గ్రామాల్లో భూ సమస్యలు, అటవీ, దేవదాయ భూముల సమస్యలు పరిష్కరించాలని మండలంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులకు దరఖాస్తులు వస్తున్నాయన్నారు. అనంతరం శివారు గ్రామం సాయినగర్‌లో 1992లో 223 మంది పేదలకు ప్రభుత్వం పట్టాలిచ్చిందని, అయితే దేవదాయ శాఖాధికారులు ప్రభుత్వం తమకు ఇచ్చిన పట్టాలను రద్దు చేయాలని చూస్తున్నారని, అలా జరగకుండా చూడాలని సీపీఎం నాయకులు సోమోజు నాగమణి, కోట కృష్ణ, లింగారావు, రామనాథం తదితరులు వినతిపత్రం అందజేశారు. ఇదిలా ఉండగా జగ్గయ్యపేటలోని రంగనాయక స్వామి వారి ఆలయానికి చెందిన 1.18 ఎకరం భూమికి పాసు పుస్తకం ఇవ్వాలని దేవదాయ శాఖాధికారులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయా సమస్యలపై 10 దరఖాస్తులు అందాయన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ అనూష్ బాబు, వీఆర్వో నాగభూషణం, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

రెండు బస్సులు ఢీ ... తప్పిన పెను ప్రమాదం



ఢీకొన్న బస్సులు

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): రెండు బస్సులు ఢీకొన్న ఘటనలో ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగకపోవటంతో ఊపిరి పీల్చుకున్న సంఘటన 65వ నంబరు జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున జరిగింది. వివరాల్లోకి వెళితే హైదరాబాద్ నుంచి విజయవాడకు వస్తున్న గన్నవరానికి చెందిన ఆర్టీసీ బస్సు గ్రామంలోని తిరుమలగిరి ఆర్చి సమీపంలోకి రాగానే రోడ్డుపై గొర్రెలు అడ్డు రావటంతో డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. ఈ క్రమంలో అదే రహదారిలో వెనుకగా వస్తున్న ఆరెంజ్ ట్రావెల్స్ బస్సు ఆర్టీసీ బస్సును వెనుకగా ఢీకొట్టింది. ట్రావెల్స్ బస్సు ముందు భాగం దెబ్బతింది. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకపోవటంతో ఊపిరి పీల్చుకున్నారు. చిల్లకల్లు పోలీసులు కేసు నమోదు చేయలేదు. ప్రయాణికులను వేర్వేరు బస్సుల్లో పంపించారు.

వెంకటేశ్వర స్వామికి రూ.26.13 లక్షల ఆదాయం

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలోని వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి వారికి హుండీ కానుకల ద్వారా రూ.26.13 లక్షల ఆదాయం వచ్చిందని ఏసీ వరప్రసాద్ తెలిపారు. స్థానిక ఆలయ ఆవరణలో మంగళవారం హుండీ కానుకల లెక్కింపు నిర్వహించారు. లెక్కింపులో పై నగదుతో పాటు 45 గ్రాముల బంగారం, 220 గ్రాముల వెండి వచ్చిందన్నారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పవన్‌కళ్యాణ్, పాలకవర్గ సభ్యులు భరద్వాజ్, అర్చకులు పాల్గొన్నారు.

మండలంలో 95 శాతం పింఛన్‌ల పంపిణీ

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలోని అన్ని గ్రామాల్లో అన్ని రకాల పింఛన్‌లను 95 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీవో నితిన్ తెలిపారు. తెల్లవారుజాము నుంచే ఆయా గ్రామాల్లో సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు పింఛన్‌లు పంపిణీ చేశారన్నారు.

ముగిసిన మండల దీక్షా మాలధారణ

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి మండల దీక్ష మాలధారణ తీసుకునే భక్తులతో మంగళవారం ఆలయ ప్రాంగణం ఎరుపెక్కింది. మండల దీక్ష మాలధారణ తీసుకునేందుకు ఆలయం వారు నిర్ణయించిన చివరి రోజు కావటంతో ఆంధ్రా, తెలంగాణ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 4 వేల మంది భక్తులు దీక్ష తీసుకున్నారు. డిసెంబర్ 25 నుంచి 31 వరకు జరిగిన మాలధారణ కార్యక్రమంలో మొత్తం 8 వేల మంది వరకు ఆలయంలో మాల వేసుకోగా, వివిధ గ్రామాల్లో గురుస్వాములు మాల వేసిన వారు మరో 10 వేల మంది ఉంటారని ఆలయ అధికారులు అంటున్నారు. ఆలయ ఈవో బీహెచ్‌వీఎస్ఎన్ కిషోర్ కుమార్, చైర్మన్ జంగాల శ్రీనివాసరావు పర్యవేక్షణ చేశారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

వీరులపాడు: రైతులకు సంబంధించిన భూముల సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ హుస్సేన్ అన్నారు. మండలంలోని వి.అన్నవరం గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సదస్సులో వివిధ సమస్యలపై 10 దరఖాస్తులు అందాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుంధతీ దేవి, సర్పంచ్ జమ్ముల వరబాబు, ఎంపీటీసీ సభ్యుడు తోట నారాయణరావు పాల్గొన్నారు.

న్యాయవాది మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి

నందిగామ టౌన్: అనంతపురానికి చెందిన సీనియర్ న్యాయవాది శేషాద్రి మృతికి కారణమైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద్రు బాబూవిద్యా సాగర్ పేర్కొన్నారు. న్యాయవాది శేషాద్రి మృతికి నిరసనగా మంగళవారం నందిగామలో న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో న్యాయవాదులపై జరుగుతున్న దాడులపై సమగ్ర విచారణ జరపాలన్నారు. న్యాయవాదులపై దాడులకు పాల్పడకుండా ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు అద్దంకి మణిబాబు, కన్నెగంటి జీవరత్నం, యర్రంరెడ్డి బాబురావు, బండి మల్లికార్జునరావు, మన్నెం నారాయణరావు, చిరుమామిళ్ల కిరణ్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.